అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 17 జనవరి 2023

మౌలాలితండాలో కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని మౌలాలి తాండ గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని యువతకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా ఆదేశాల మేరకు ఈ పోటీలను నిర్వహించినట్టు సర్పంచ్ జాదవ్ సునీత బాబు నాయక్, రైతుబంధు జిల్లా డైరెక్టర్ ఎండీ మౌలానా తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువతకు క్రీడా పోటీలను నిర్వహించినట్టు వారు పేర్కొన్నారు. గెలుపొందిన జట్టుకు రూ.552 నగదు బహుమతిని అందజేసినట్టు వారు తెలిపారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు గ్రామపంచాయతీ నుంచి స్థలాన్ని కేటాయించాలని మండల బీజేపీ నాయకులు ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్‌కు, సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్‌కు, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజితయాదవ్‌కు సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లెపూల శ్రీనివాస్, కందగట్ల రామచందర్, నాయిని సతీష్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, బీజేపీ, బీజేవైఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేషన్ డీలర్ల భర్తీలో జాప్యం



- జిల్లాలో 89 ఖాళీలు

నవతెలంగాణ-లింగంపేట్

జిల్లాలో రేషన్ దుకాణాల్లో పలు చోట్ల డీలర్‌ల పోస్టులు ఖాళీగా మారాయి. అయినా వాటి భర్తీపై జిల్లా యంత్రాంగం చొరవ తీసుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డీలర్‌లు లేక ఉన్న డీలర్‌లకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించడంతో రేషన్ పంపిణీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల 35 వేల 202 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. అదేవిధంగా 17,585 అంత్యోదయ, 989 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతినెలా బియ్యం సరఫరా చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 578 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అయితే వీటిల్లో 89 దుకాణాలకు డీలర్‌లు లేరు. దీంతో సమీప దుకాణాలు గల డీలర్‌లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. లింగంపేట్ మండలంలోని 28 రేషన్ దుకాణాలకు గాను నాలుగు ఖాళీగా ఉన్నాయి. భవానిపేట్, జల్దిపల్లి, పోల్కంపేట్, లింగంపేట్‌లోని ప్రస్తుతం ఇన్‌చార్జిలతో కొనసాగుతున్నాయి. ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించన చోటు సకాలంలో బియ్యం అదడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తమకున్న దుకాణాల్లో బియ్యం సరఫరా చేసి, అనంతరం మరో దుకాణానికి వచ్చి ఇవ్వడంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుంది. డీలర్‌లకు సైతం పనిభారంతో ఇక్కట్లు పడుతున్నారు. దీంతో పాటు పలువురు రేషన్ డీలర్‌లు తాము ఉంటున్న షాప్ వద్దకే లబ్దిదారులను పిలిపించుకొని బియ్యం అందజేస్తున్నారు. దీంతో లబ్దిదారులు దూరాభారంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో నిరుద్యోగులు చాలా మంది ఉన్నారని, వెంటనే ఖాళీగా ఉన్న రేషన్ డీలర్‌ల భర్తీ చేపట్టాలని లబ్దిదారులు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రాణం ఖరీదు.. లక్షా 20 వేలు

- కంపౌండర్ వైద్యంతో వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-పిట్లం

కంపౌండర్ వచ్చీ రాని వైద్యం చేయడంతో వృద్ధురాలు మృతిచెందగా.. ప్రాణానికి ఖరీదు కట్టి రూ. లక్షా 20 వేలు చేతిలో పెట్టారని వృద్ధురాలి భర్త కన్నీరుమున్నీరు అవుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. పిట్లం మండలం జగదాంబతండాకు చెందిన బీమ్లిబాయ్(60) మోకాళ్ల నొప్పులతో బాధపడుతుండగా.. మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాగా అక్కడ వైద్యుడు లేకున్నా.. కాంపౌండర్ వైద్యం చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కంపౌండర్ వచ్చీరాని వైద్యం చేయడంతో తన భార్య మృతిచెందిందని భర్త బిఖ్య నాయక్ వాపోయాడు. తాము ఆందోళన చేపట్టడంతో మండల నాయకులు, పలువురు పెద్దతు కలిసి తన భార్య ప్రాణానికి వెల కట్టారని, వారి మాటను ఎదురించలేక.. భార్య మృతితో నిస్సహాయ స్థితిలో ఉండిపోయానని సోమవారం విలేకరుల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశాడు. సదరు ఆస్పత్రి వైద్యులు గతంలో ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ చేసి ప్రయివేటుగా ఆస్పత్రి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం వృద్ధాప్య సమస్యలతో బాధపడుతుండగా.. కంపౌండర్ వచ్చిరానీ వైద్యం చేసి తన భార్య ప్రాణాలు తీశాడని ఆరోపించారు. ధనార్జనే పరమావధిగా భావించే ఇలాంటి వైద్యులను, కాంపౌండర్లపై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని కోరుతున్నాడు.

క్రమ పద్ధతిలో కంటిపరీక్షలు

- కంటి వెలుగు శిబిరాలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టాలి
- ఉదయం 9 నుంచి 4 గంటల వరకూ శిబిరాలు కొనసాగాలి
- జిల్లా అధికార యంత్రాంగానికి మంత్రి సూచన





నిజామాబాద్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, సీపీ, డీపీవో, డీఎంఅండ్‌హెచ్‌వో.. కామారెడ్డిలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ కామారెడ్డిటౌన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు శిబిరాలకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా సాఫీగా సాగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీష్‌రావు సూచించారు. శిబిరాల వద్ద ఒకేసారి ప్రజలు గుమిగూడకుండా ప్రణాళికాబద్ధంగా, క్రమ పద్ధతిలో కంటి పరీక్షలు నిర్వహించుకునేలా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్ సమీక్ష నిర్వహిస్తూ పలు సూచనలు చేశారు. ఈ నెల 18న ఖమ్మంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కంటి వెలుగు-2 కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని, మరుసటి రోజు అన్ని జిల్లాలలో ఉదయం 9 గంటలకు కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎక్కడిక క్కడ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ఆహ్వానించి నిర్దేశిత ప్రాంతాల్లో శిబిరాలు ప్రారంభించాలని కలెక్టర్లకు సూచించారు. శిబిరాల వద్ద తోపులాటలు, గలాటాలు, గందర గోళ పరిస్థితులు ఏర్పడకుండా భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ యంత్రాంగాన్ని కోరారు. ప్రతి శిబిరం వద్ద తగు సంఖ్యలో పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీరోజు కనీసం 120 నుండి 130 మందికి నేత్ర పరీక్షలు చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విధిగా శిబిరాలు కొనసాగాలని, వైద్య బృందాలు ఉదయం 8:45 గంటలకు, ఏ.ఎన్.ఎం లు, ఆశా కార్యకర్తలు ఉదయం 8:00 గంటలకే శిబిరాల వద్దకు చేరుకోవాలని ఆదేశించారు. ప్రపంచంలోనే మరెక్కడా లేనివిధంగా పెద్దఎత్తున చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలని హితవు పలికారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ మొదటి విడత కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విధంగా, అదే తరహా స్ఫూర్తితో ప్రస్తుతం కంటి వెలుగు-2 కార్యక్రమాన్ని మరింత పకడ్బందీగా నిర్వహించేం దుకు ప్రతి ఒక్కరు చొరవ చూపాలన్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా శిబిరాల్లో నాణ్యతతో కూడిన సేవలందించాలని, అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలను అప్పటికప్పుడే అందించా లన్నారు. శిబిరాల నిర్వహణ కోసం ఇప్పటికే జిల్లాలకు నిధులు కేటాయించడం జరిగిందని, ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ, కమిషనర్ శ్వేతా మహంతి, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కెఆర్ నాగరాజు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శనం, డీపీఓ జయసుధ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానం అందించాలి

కంటి వెలుగు కార్యక్రమాన్ని ముందస్తు షెడ్యూల్ ప్రకారం వార్డుల వారీగా కంటి వెలుగు శిబిరాలను నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచంచారు. అధికారులతో కంటి వెలుగు ఏర్పాట్లపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిబిరాల వద్ద షామీయానాలు ఏర్పాటు చేసి ప్రజలకు రక్షిత తాగునీరు, కుర్చీలు సరిపడా సమకూర్చాలని చెప్పారు. టాయిలెట్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. పట్టణాల్లో ఏర్పాటు చేసే కంటి వెలుగు శిబిరాల ద్వారా ప్రతిరోజు 300 మందికీ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే కంటి వెలుగు శిబిరం ద్వారా ప్రతిరోజు 200 మందికి పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేసినందున ఆ దిశగా ఏర్పాటు చేయాలన్నారు. కంటి వెలుగు శిబిరాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానం అందించాలని అన్నారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా స్వయం సహాయక బృందాలు అంగన్వాడీ టీచర్ల సహాయంతో మోబిలైజేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ నెల 19 నుంచి కంటి వెలుగు శిబిరాలు ముగిసే వరకు ప్రతిరోజు కంటి వెలుగు శిబిరాల్లో పరీక్షించిన వారి వివరాలను తనకు నివేదించాలని జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మణ్ సింగ్, వైద్యులు, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

- రోడ్డు పక్కన మట్టికొట్టుకుపోవడంతో పొంచి ఉన్న ప్రమాదం



కల్వర్టు వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని దేమికలాన్ గ్రామ శివారులో గల రోడ్డు పక్కన కల్వర్టు నిర్మించారు. కానీ రోడ్డు పక్కన మట్టి పోయకపోవడంతో ఒక మీటర్ లోతు పొడవు గుంతలాగా ఏర్పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఉంది. దేమికలాన్ నుంచి కరడుపల్లి మీదుగా గాంధారికి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అదమరిస్తే ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. కావున అధికారులు స్పందించి బీటీ రోడ్డు పక్కన మట్టి పోయించి గుంతను మూసివేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అర్జీలను ఎప్పటికప్పుడూ పరిష్కరించాలి

- ప్రజవాణిలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ చెప్పారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 12 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి.

ఇరిగేషన్ డీఈఈ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నవీపేట్



కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మండ లంలోని పొతంగల్ నివాసి ఇరిగేషన్ డీఈఈ రమణ రావు కుటుంబాన్ని బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సోమ వారం పరామర్శించారు. ఈ సంద ర్భంగా రమణారావు తండ్రి గంగాధర్ రావుతో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వంతో పాటు తాను వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని తెలిపారు. ఒక మంచి అధికారిని కోల్పోవడం చాలా బాధాకరమని అనుభవంతో పాటు ఎంతో నైపుణ్యం ఉన్న అధికారి రమణారావు అని గుర్తు చేశారు. మరొకసారి వచ్చి తప్పక కలుస్తానని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ సంగెం శ్రీనివాస్, పార్టీ అధ్యక్షులు నర్సింగ్ రావు, పిఎసిఎస్ చైర్మన్ అబ్బన్న, సర్పంచ్ బత్తూరు సాయిలు, నాయకులు బుచ్చన్న, సంజీవరావు, రవీందర్‌రావు, రమేష్, వీరేందర్ రావు, గైని సతీష్, సౌదా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేసినట్టు తేలితే ఏ శిక్షకైనా సిద్ధం

- మైనార్టీ ఎమ్మెల్యే కావడంతోనే నాపై అసత్య ప్రచారాలు
- రైస్‌మిల్లుల్లో ఎప్పుడైనా తనిఖీ చేసుకోవచ్చు : ఎమ్మెల్యే షకీల్ ఆమేర్



రైస్‌మిల్‌కు కేటాయించిన, సరఫరా చేసిన ధాన్యం వివరాలు చూపుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

తాను ఏకైక మైనారిటీ ఎమ్మెల్యే కావడంతోనే తనపై కక్ష కట్టి అసత్యమైన, నిరాధారణమైన ఆరోపణలు చేస్తున్నారని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమీర్ అన్నారు. తన రైస్ మిల్లులలో ఎవరు ఎప్పుడైనా తనిఖీలు చేసుకోవచ్చని, తాను తప్పు చేసినట్లు తేలితే ఏ శిక్షకైనా సిద్ధం అని స్పష్టం చేశారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాను రైస్ మిల్ వ్యాపారంలో అనుభవంతోనే మిల్లులు ఏర్పాటు చేశానని, ప్రభుత్వానికి నిబంధనల ప్రకారం బియ్యం సైతం అందించినట్టు తెలిపారు. 60 శాతం బియ్యం ఎఫ్‌సీఐకు నిబంధనల ప్రకారం అందజేసినట్టు తెలిపారు. తాను కోట్ల రూపాయల బియ్యం అందించకుండా చేసినట్లు ఓ పత్రిక కథనాలు రాయడం తనను తీవ్రంగా కలిచివేసినట్టు తెలి పారు. ప్రజా జీవితంలో ఒక మైనారిటీ ఎమ్మెల్యేగా ఉన్న తనపై అసత్యమైన వార్తలు రాయడం మానుకోవాలని సూచించారు. తన రైస్ మిల్లులలో ఎవరు ఎప్పుడైనా తనిఖీలు చేసుకోవచ్చని ఎలాంటి సందేహం లేదని అన్నారు. తాను తప్పు చేసినట్లు తేలితే ఏ శిక్షకైనా సిద్ధం అని అన్నారు. తనపై లేనిపోని తప్పుడు కథనాలతో తన ప్రతిష్టకు భంగం కలిగించవద్దని హెచ్చరించారు. తప్పుడు కథనాలపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం తన రైస్ మిల్‌కు కేటాయించిన, ప్రభుత్వానికి అందించిన బియ్యం వివరాలను విలేకరుల ఎదుట ప్రదర్శించారు. ఈ సమావేశంలో డిసిసిబి డైరెక్టర్ గంగారెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, ఎంపీపీ శ్రీనివాస్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్




నినాదాలు చేస్తున్న రైతులు

పసుపు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని గత లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్ వేసిన రైతులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ మార్కెట్ యార్డులో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర రావడం లేదని, కావున ఎంఐఎస్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రపోజల్ పంపించాలని, కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరతో పంట కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని, లేకుంటే ఇటీవల నష్టం వాటిల్లిన పంటకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు కొమ్ముల సంతోష్ , పడిగెల ప్రవీణ్ బద్దం సురేష్, వన్నెల్ తిరుపతి, లింగారెడ్డి గంగారం సాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్



పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ

మండలం లోని యాచారం గ్రామంలో సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ కమిలి నర్సింలు సోమవారం ప్రారంభించారు. రూ.5లక్షల జడ్పీ నిధులతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, ఏలేటి భూంరెడ్డి, టీఆర్ఎస్ నాయకులు రమేష్, సురేందర్, శంకర్ నాయక్, పీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున్‌పై దాడి సహించనిది



మాట్లాడుతున్న గురుమిల్ల రాజు

నవతెలంగాణ-బోధన్

ఉపాధ్యాయుడు మల్లికార్జునపై మతోన్మాదుల దాడి సహించలేనిదని కుల అసమానత నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని బాధిత ఉపాధ్యాయుడిని పరామర్శించి సంఘీభావం తెలిపారు. నాలుగు నెలల క్రితం జరిగిన ఘటనను సహించలేనివారు ఇప్పుడు దానిని మనసులో పెట్టుకొని ఉపాధ్యాయుడిని అవమానించడం సిగ్గుచేటని అన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు చేపట్టలేదని నిందితులు ఇచ్చిన ఫిర్యాదుతో ఉపాధ్యాయుడుపై కేసు నమోదు చేయడం సమంజసం కాదన్నారు. ఉపాధ్యాయుడికి న్యాయం జరిగే వరకూ మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల అసమానత నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గురుమిల్ల రాజు, సావిత్రిబాయిపూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారం సరోజన, మల్లికార్జున్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు మంజుల, శ్రీకాంత్, హరికృష్ణ, సిరివెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఎంపీడీవోగా నారాయణ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి ఎంపీడీవోగా నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణ లింగంపేట్ నుంచి బదిలీపై ఎల్లారెడ్డి వచ్చారు. ఎల్లారెడ్డిలో పనిచేసిన ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి లింగంపేట్ ఎంపీడీవోగా బదిలీ అయ్యారు.

మాస్టర్‌ప్లాన్‌ను రద్దుచేస్తేనే మాకు పండుగ

- సంక్రాంతిరోజు ముగ్గులు వేస్తూ రైతు కుటుంబీకుల నిరసన



కామారెడ్డిలో రోడ్లపై ముగ్గులు వేస్తున్న రైతుల కుటుంబీకులు

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

'మాస్టర్‌ప్లాన్ రద్దు చేసిన రోజు మాకు అసలైన పండుగ', 'మీ పిల్లల భవిష్యత్తు కోసం మా పిల్లల భవిష్యత్తు నాశనం చేయొద్దు', 'మాస్టర్‌ప్లాన్ రద్దు చేయకుంటే రైతుకు ఉరే' అంటూ మాస్టర్‌ప్లాన్ బాధిత కుటుంబీకులు ముగ్గులు వేస్తూ తమ ఆవేదనను వ్యక్తపరిచారు. సంక్రాంతి పండుగ రోజు సైతం రైతుల నిరసనలు కొనసాగాయి. పండుగపూట ఆదివారం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు పలు ప్రధాన రహదారులు, చౌరస్తాలపై రైతు కుటుంబీకులు ముగ్గులు వేసి నిరసన వ్యక్తం చేశారు.

40 ఏండ్లుగా పతంగుల తయారీ

పిట్లం నుంచి దూర ప్రాంతాలకు తరలింపు



గాలిపటాలు తయారు చేస్తున్న రిటైర్డ్ హెచ్ఎం సలీం

నవతెలంగాణ-పిట్లం

పిట్లం మండల కేంద్రానికి చెందిన ఉస్మాన్, సలీం 40 ఏండ్లుగా గాలి పటాలను తయారు చేస్తూ తమకంటూ ఓ ప్రత్యేకత చాటుకుం టున్నారు. కుటుంబీ కులతో పాటు 2 నెలలుగా శ్రమించి సంక్రాంతి పండగ నాటికి సుమారు 5 వేల గాలిపటాలను తయారుచేసి మండలంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రాలకే కాకుండా కామారెడ్డి జిల్లా, మహారాష్ట్ర దేగ్లూర్ జిల్లాకు వరకు ఎగుమతి చేస్తుంటారు. తామే స్వయాన పేపర్, వెదురు బొంగుల ను కొనుగోలు చేసి, గాలిపటాలను తయారు చేస్తున్నట్టు పేర్కొన్నారు. 40 ఏండ్లుగా గాలిపటాలు తయారు చేసి ఇక్కడి నుంచి సుదూర ప్రాంతాలకు తరలి స్తుండటంతో పిట్లంను గాలిపటాలకు పుట్టినిల్లుగా పలువురు పేర్కొంటున్నారు.

మైనారిటీ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మైనారిటీ కార్పొరేషన్ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను మంగళవారం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జీ ఎంపీడీఓ సురేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు వచ్చే వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, కులధృవీకరణ ఆదాయం, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్‌కార్డు తీసుకుని ఉదయం 11 గంటలకు హాజరుకావాలని తెలిపారు

పరీక్షలో ఇద్దరు డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో సోమవారం ఉదయం జరిగిన యూజీ 4వ సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్షలో 2851మంది విద్యార్థులకు గాను 2672మంది హాజరయ్యారని, 179మంది గైర్హాజరయ్యారనితెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు. నిజామాబాద్ నిషిత డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో ఫిజిక్స్ పరీక్ష లో ఒకరు, డిబర్ అయ్యారని, ఆర్మూర్ సిద్దార్థ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం లో 3వ సెమిస్టరు (రెగ్యులర్)ఎలక్ట్రో మాగ్నెటిక్ పరీక్ష లో మరొకరు డిబర్ అయ్యారని చెప్పారు. మధ్యాహ్నం జరిగిన 3వ సెమిస్టరు (రెగ్యులర్) పరీక్షలో 9846 మందికి గాను 8940మంది హాజరయ్యారని 906 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

టీఎస్‌యూటీయఫ్ రాష్ట్ర కార్యదర్శిగా డి.సత్యానంద్

నవతెలంగాణ-కంటేశ్వర్



టీయస్ యూటీయఫ్ రాష్ట్ర కార్యదర్శిగా డి.సత్యానంద్ నాల్గోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారనీ టీయస్‌యూటీయఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒ.రమేష్ సోమవారం తెలిపారు. ఈనెల 13,14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగుడలో జరిగిన టీయస్‌యూటీయాఫ్ రాష్ట్ర మహసభలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుండి ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యదర్శిగా డి. సత్యానంద్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఓ.రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ పక్షాన వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

జోరుగా యాసంగి సాగు

- బాల్కొండ నియోజకవర్గంలో ఊపందుకున్న వ్యవసాయ పనులు
- అత్యధికంగా వరి, పసుపు, మొక్కజొన్న సాగు
- పంటల సేకరణలో వ్యవసాయాధికారులు



వరిసాగుకోసం సిద్ధం చేసిన నారు, దుక్కిచేసిన పొలం



బోర్లవద్ద వేసిన నాట్లు

నవతెలంగాణ-ముప్కాల్

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో యాసంగి సీజన్ వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి, వేల్పూర్, భీంగల్ మండలాల్లో పొలాలను రైతులు సిద్ధం చేసుకొని పంటలు సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా వరి, పసుపు, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు. కరెంటు బోరు బావులు, నీటి సౌలభ్యం ఉన్న రైతులు గత నెల రోజుల క్రితం నుంచి వరి సాగు పనులు ప్రారంభించారు. నారును సిద్ధం చేసుకోని దుక్కులు, దమ్ములు ముగించుకొని వరి నాట్లు వేసేందుకు మొదలుపెట్టారు. నీటి సౌలభ్యత తక్కువగా ఉన్న రైతులు మిర్చి, సోయా, సన్ ఫ్లవర్, నువ్వులు వంటి ఆరుతడి పంటల సాగు చేస్తున్నారు. ఈ సారి నియోజకవర్గంలో అక్కడక్కడా ఫామ్ ఆయిల్, డ్రాగన్ ఫ్రూట్, ఉద్యాన పంటలను సైతం రైతులు సాగు చేస్తున్నారు. పంటలను ముందస్తుగా అంచనా వేసిన వ్యవసాయాధికారులు అందుకు తగ్గట్టుగా ఎరువులు, మందులను అందుబాటులో ఉంచేందుకు తగు జాగ్రత్తలను తీసుకుంటున్నారు.

దాదాపు లక్ష ఎకరాల్లో సాగు..

మెండోరా, బాల్కొండ, ముప్కాల్, ఏర్గట్ల, మండలాల్లో దాదాపు లక్ష ఎకరాల వరకు పంటలను సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు ఒక అంచనా వేశారు. ఈ యాసంగిలో నియోజకవర్గంలో 70 వేల ఎకరాలకు పైగా వరి, 20 వేల ఎకరాల వరకు పసుపు, 8 వేల ఎకరాల మేర మొక్కజొన్న, 600 నుంచి 900 ఎకరాల్లో సోయా, 300 నుంచి 500 ఎకరాల్లో మినుములు, 3 వేల నుంచి 5 వేల ఎకరాల ఉద్యాన వన పంటలు, ఫామ్ ఆయిల్, ఇతర పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ విస్తీర్ణ అధికారులు (ఏఈవో)లు గ్రామ గ్రామన పర్యటిస్తూ రైతులకు పంటల సాగుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. పంటల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. వ్యవసాయశాఖ అంచనా మేరకు యూరియా 18,500 మెట్రిక్ టన్నులు, డీఏపీ 5 వేల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 7,300 మెట్రిక్ టన్నులు, పోటాష్ 2,100 మెట్రిక్ టన్నుల ఎరువుల అవసరం అయ్యే అవకాశం ఉందని, రైతుల అవసరం మేరకు ఎరువులను అందుబాటులో ఉంచేందుకు తగు చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారులుతెలిపారు.

నీటి సౌలభ్యత ఉండడంతో వరి సాగు చేస్తున్నా..



మూడెకరాల్లో వరి, నాలుగెకరాల్లో పసుపు, మూడెకరాల్లో మొక్కజొన్న వేశాను. సొంతంగా బోరు ఉండడంతో నీటి సమస్య లేదు. రైతు బంధు డబ్బులు, పెట్టుబడి ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి. వాతావరణం అనుకూలించి పంట బాగా పండితే అదే మాకు జీవితం.

మిట్టపల్లి వెంకట్ రెడ్డి-రైతు-మెండోర

ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి



నాకున్నా వ్యవసాయ భూముల్లో పలు రకాల పంటలు సాగు చేస్తున్న, వరి నాట్లు పూర్తి చేసి కలుపు తీసేందుకు సిద్ధంగా ఉన్నాం. వేసిన పంటల సాగుకు తగ్గట్టు ఎరువులు, మందులు అందుబాటులో ఉండేలా వ్యవసాయాధికారులు తగు చర్యలు తీసుకోవాలి..

ఎట్టం మహేష్-రైతు-వేంపల్లి

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఏఈవోలు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటున్నారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న ఏఈవోలను సంప్రదించాలి.

మల్లయ్య, ఏడీఏ, భీంగల్

నేటి నుండి ఎల్లారెడ్డిపల్లిలో వారాంతపు సంత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందల్‌వాయి, ధర్పల్లి, భీంగల్ రహదరికి ఆనుకుని భారత్ మాత సమీపంలో ప్రతి మంగళవారం వారాంతపు సంత ఉంటుందని సర్పంచ్ నరేష్, గ్రామఅభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఎల్లారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వారాంతపు సంత నిర్వహిస్తున్నట్టు చెప్పారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, వ్యాపారులు భారీగా తరలివచ్చి వారాంతపు సంత ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



ధర్మారం గ్రామానికి చెందిన యువకుడు కనిపించకుండా పోయాడని ఎస్ఐ లింబాద్రి సోమవారం తెలిపారు. కిరణ్ కుమార్ నాలుగు ఐదు రోజుల క్రితం పని కోసం నిజామాబాద్ కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆయనకోసం చుట్టుపక్కల, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆయన తండ్రి అయిన రవి నిజామాబాద్ రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్సై లింబాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న సునీల్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-మెండోర

మండలంలోని సావెల్ గ్రామానికి చెందిన ఇప్పరాంరెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. కుటుంబీకులను ఓదార్చి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట సునీల్ సేన సభ్యులు ఉన్నారు.

ఎంపీపీ భర్తపై దాడి

పలువురిపై కేసునమోదు

నవతెలంగాణ-ముప్కాల్

బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ముప్కాల్ ఎంపీపీ సామ పద్మ భర్త వెంకట్ రెడ్డిపై సోమవారం దాడికి పాల్పడ్డారు. ఉదయంవేళ స్థానికులైన గడ్డం సంతోష్, ఆయన తమ్ముడు గడ్డం దిలీప్, గడ్డం సంతోష్ కుమారుడు గడ్డం సాయిరెడ్డి గాంధీ చౌక్ వద్ద ఒక్కసారిగా మూకుమ్మడిగా వెంకట్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. రాళ్ళతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకట్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు.

వేవా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆశన్నగారి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

టీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా వేవా క్యాలెండర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజంలో విశ్వకర్మల పాత్ర గర్వించదగినదని, తెలంగాణ ఉద్యమంలో వీరి పాత్ర గొప్పదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భర్త పండిత్ పవన్, కౌన్సిలర్ కాశీరాం, వేవా రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారాం, డివిజన్ అధ్యక్షులు గంగాధర్, సహాధ్యక్షులు ఇ.లక్ష్మీ నారాయణ, మంచిర్యాల సురేష్ కుమార్, లక్ష్మీపతి, ఉపాధ్యక్షులు వి.లక్ష్మీ నారాయణ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి నటరాజు, రవీంధర్, లక్ష్మణ్, వెంకట రమణ, శివాజీ, స్వామి, శ్రీనివాస్, సలహాదారులు శంకర్, బుచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

18 నుండి మగ్గం వర్క్, టైలరింగ్ శిక్షణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎస్బిఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈసిటిఐ)డిచ్‌పల్లి ఆధ్వర్యంలో ఈనెల 18 నుండి మగ్గం వర్క్ టైలరింగ్ (కుట్టు మిషన్) 30 రోజుల శిక్షణ ప్రారంభం కానున్నట్లు ఎస్బిఐ శిక్షణా సంస్థ డైరెక్టర్ కృష్ణ సోమవారం తెలిపారు. ఉచిత శిక్షణతో పాటుగా ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందని, శిక్షణ కాలంలో మెటీరియల్, బుక్స్, యూనిఫామ్ అందిస్తామని వివరించారు. శిక్షణలో వ్యాపార అభివృద్ధికి వ్యక్తిత్వ వికాసం తరగతులు కూడా నిర్వహిస్తామని, శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రము అందజేస్తామని తెలిపారు. 19 నుండి 35 సంవత్సరాల వయసు కలిగి ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణకు వచ్చే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 10వ తరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు ఫోటోలు, తెచ్చుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఏదైనా సమాచారం కోసం ఎస్‌బిఐ శిక్షణా కేంద్రం వెలుగు ఆఫీసు పక్కన ఘన్‌పూర్ రోడ్ డిచ్ పల్లిలో 08461 222428, 08461 295428 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం

పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాల్గోట్ రవీందర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

క్రీడా పోటీలు శరీరానికి శక్తిని ఇవ్వడానికి మానసికోల్లాసానికి పయోగపడతాయని పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాల్గోట్ రవీందర్ అన్నారు. మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాల్గోట్ లింగయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ క్రీడా పోటీలు పుప్పాలపల్లి గ్రామంలో నిర్వహించామన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 14న మహిళలకు ముగ్గుల పోటీలు, బీడీలు తయారు చేయు పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఇందులో మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ కళానైపుణ్యం ప్రదర్శించారని అన్నారు.

చరిత్రకారుడు సిద్ధా సాయిరెడ్డి మృతి తీరనిలోటు

తెలంగాణ రచయితల సంఘం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా చారిత్రక వైభవం, తరతరాల బోధన్ చరిత్ర గ్రంథాల రచయిత ప్రముఖ చరిత్రకారుడు సిద్ధ సాయిరెడ్డి మృతి చెందడం సాహిత్య, పరిశోధన, సాంస్కృతిక రంగాలకు తీరని లోటు అని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఘనపురం దేవేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా నిజామాబాద్ లో నిర్వహించిన చరిత్ర సదస్సు నిర్వహణలో సిద్ధా సాయి రెడ్డి కృషి అనిర్వచనీయమని ఆయన కొనియాడారు. సందర్భం వచ్చిన ప్రతిసారి నిజామాబాద్ చరిత్రను వేదికలపై సాధికారికంగా ప్రకటించే సిద్ధసాయి రెడ్డి జీవితాంతం చరిత్ర పరిశోధనకు ఎనలేని కృషి చేశాడని ఆయన నివాళు లర్పించారు. బోధన్ నియోజకవర్గంలోని లంగ్డా పూర్ గ్రామానికి చెందిన సిద్ధ సాయిరెడ్డి ప్రాచీన భారత చరిత్ర సంస్కృతి పురావస్తు శాస్త్రం లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, చరిత్ర అంశంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి రెండు స్నాతకోత్తర డిగ్రీలను సాధించాడు. బోధన్ ప్రాచీన చరిత్ర విషయంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి ఎంఫిల్ డిగ్రీ అందుకున్న సిద్ధ సాయి రెడ్డి నిజామాబాద్ జిల్లా చరిత్ర ప్రాచీనత అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ కోసం పరిశోధన చేస్తున్నారు. సుదీర్ఘకాలం కామారెడ్డి గంజి వర్తక సంఘం జూనియర్ కళాశాలలో చరిత్ర ఉపన్యాసకులుగా సేవలందించి ఉద్యోగ విరమణ అనంతర జీవితం అంతా చరిత్ర పరిశోధన అంకితం చేశాడని అన్నారు. ఎన్నో పత్రికల్లో ఆయన వ్యాసాలు ప్రచురితమయ్యాయని, నిజామాబాద్ జిల్లా సమగ్ర చరిత్ర మూడు భాగాలుగా ఆయన రచించారని తెలిపారు. ఈ గ్రంథాలు ఇంకా ముద్రణ కావలసి ఉన్నాయని, బోధన్ చరిత్ర, అస్మకుల చరిత్ర, బోధన్ చాళుక్యుల చరిత్ర, దోమకొండ రాజుల చరిత్ర, నిజామాబాద్ జిల్లా దేవాలయాలు, కోటలు, పురావస్తు ఆధారాలు, శిల్ప వైభవం మొదలైన ఎన్నో వ్యాసాలను పరిశోధనాత్మక శైలిలో రాసి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. వారి మృతి పట్ల తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్, భారత్ జాగృతి సాహిత్య విభాగం కన్వీనర్ తిరుమల శ్రీనివాస్ ఆర్య, హరిదా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసర్ల నరేష్, సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి గంట్యాల ప్రసాద్, కొరవి గోపరాజు సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు కంకణాల రాజేశ్వర్, తెరసం ప్రధాన కార్యదర్శి గుత్పు ప్రసాద్, ఇందూర్ యువత సాయిబాబు, ప్రముఖ కవులు విపి చందన్ రావు, దారం గంగాధర్, పంచరెడ్డి లక్ష్మణ్, చరిత్రకారులు కందకుర్తి యాదవరావు, కందకుర్తి ఆనంద్ రావు తదితరులు విచారం వ్యక్తం చేశారు.

గంజాయిలో పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు

- 300 గ్రాముల గంజాయి, మూడుసెల్ పోన్లు స్వాధీనం

నవతెలంగాణ-భీంగల్

భీంగల్ పట్టణకేంద్రంలోని బెజ్జోర బైపాస్ రోడ్డు వద్ద ముగ్గురు యువకులు గంజాయితో పట్టుబడినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఎస్సై రాజ్‌భరత్ రెడ్డి సిబ్బందితో కలిసి బెజ్జోర రోడ్డులోని జక్లత్ ఒర్రె వద్ద గస్తీ నిర్వహించారు. బైపాస్ రోడ్డు వద్ద ముగ్గురు యువకులు అనుమానస్పదంగా తిరుగుతుండడంతో వారిని పట్టుకొని విచారించారు. భీంగల్ కు చెందిన జంబుక శివ, బెజ్జోరకు చెందిన ఎర్రోల్ల రోహన్, కోనసముందర్‌కు చెందిన మరో మైనర్ యువకుడు 300 గ్రాముల ఎండు గంజాయితో పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు మరొకరిని జువైనల్‌హోంకు తరలించిటన్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై రాజ్‌భరత్ రెడ్డి, సిబ్బంది సురేష్, రాజ్‌కుమార్ ఉన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-భీంగల్/ఆర్మూర్/ కంఠేశ్వర్

పట్టణకేంద్రంలోని ఐదవ వార్డు కౌన్సిలర్ బొదిరె నర్సయ్య ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బొదిరె నర్సయ్య, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఆర్మూర్ :లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో పట్టణంలోని పెర్కిట్‌లోని మహిళా ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 92మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి 2000, ద్వితీయ బహుమతి వెయ్యి రూపాయలు, తృతీయ బహుమతి 500, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశారు. విజేతలకు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ చెన్న రవికుమార్ బహుమతులను అందజేశారు. ముగ్గులతో మంచి మెసేజ్ ఇచ్చారని అని అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డి ఎం పద్మ, లయన్స్ కార్యదర్శి లయన్ చిన్న రెడ్డి,ప్రోగ్రాం చైర్మన్ లయన్ మోహన్ దాస్,లయన్ అంబల్ల తిరుపతి, లయన్ జ్ఞాని చావ్లా,మహిళ ప్రాంగణం అకౌంటెంట్ రాజశ్రీ పద్మ, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్:రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ దత్తత గ్రామం లింగసముద్రం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేసినట్టు రోటరీ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సతీష్ సాహ డాక్టర్ ఆకుల విశాల్ ఆకుల తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలను ప్రోత్సహించడానికి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు రాజ్‌కుమార్ సుబేదార్, శ్రీనివాసరావు, శోభన, ఆశ, డాక్టర్ పద్మిని, సర్పంచ్ వినోద సదానంద్, ఉపసర్పంచ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, రోటరీ కమ్యూనిటీ కాప్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారన్నారు.



ఆర్మూర్ : పెర్కిట్‌లో బహుమతులు ప్రదానం చేస్తున్న లయన్స్‌క్లబ్‌వారు



భీంగల్ : బహుమతులు అందజేస్తున్న చైర్‌పర్సన్



కంఠేశ్వర్ : బహుమతులు అందజేస్తున్న రోటరీ క్లబ్‌వారు

సదరం సర్టిఫికెట్‌కోసం స్లాట్ బుకింగ్ చాలు

నవతెలంగాణ-సిరికొండ

శారీరక, మానసిక వికలాంగులకు ప్రభుత్వం అందించే సదరం సర్టిఫికెట్ కోసం ఈ నెల 18 వ తేదీ నుండి అన్ని మీసేవ కేంద్రాల్లో ప్రారంభం అవుతున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల సిసి రమేష్ సో మవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసరా పింఛన్‌కోసం తప్పకుండా సదరం సర్టిఫికెట్ అవసరమని, ఇందుకోసం తప్పక స్లాట్ బుక్ చేసుకొని, జిల్లా కేంద్రంలో సర్టిఫికెట్ పొందాలని పేర్కొన్నారు.

సీసీ రహదారులకు, పంచాయతీ భవన నిర్మాణలకు నిధులు మంజూరు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇందల్ వాయి మండలంలోని అన్ని గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక కృషితో నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో రాములు నాయక్ సోమవారం తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మండలంలోని 23 గ్రామాలకు గాను సిసి రహదారుల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నుండి కోటి 95 లక్షలు, ఐదు గ్రామపంచాయతీల భవన నిర్మాణాలకు కోటి రూపాయలు మంజూరు చేసినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఇందల్‌వాయి మండలంలోని అన్సాన్‌పల్లి, చంద్రయాన్ పల్లి, దేవి తండా, డోన్కల్, గండి తండా, గంగారం తండా, గన్నారం గుట్టకింది తండా, గౌరారం, ఇందల్‌వాయి తండా, లోలం, నల్లవెల్లి, రూప్లా నాయక్ తండ, సంస్థాన్ సిర్నాపల్లి, తిర్మన్ పల్లి, ఎల్లారెడ్డిపల్లి పంచాయతీలకు 10 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యయన్నారు. కొత్త కోరుట్ల తండా, మల్లాపూర్, మేఘ్య నాయక్ తండా, రంజిత్ నాయక్ తండా, స్టేషన్ తండా, వెంగల్ పాడ్‌కు ఐదు లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని ఎంపీడీవో రాములు నాయక్ వివరించారు.

పంచాయతీల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు

ఇందల్ వాయి మండలంలోని గుట్ట కింద తండా కు, రూప్లా నాయక్ తండ, కొత్త కోరుట్ల తండ, ఇందల్ వాయి తండాల గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయల చొప్పున మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు.

మల్లారం సెక్రెటరీకి సన్మానం



సెక్రెటరీని సన్మానిస్తున్న సర్పంచ్, తదితరులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

మండలంలోని మల్లారం గ్రామ సెక్రెటరీ ప్రశాంత్‌కు కోర్టులో ఉద్యోగం రావడంతో సర్పంచ్ చింతకింది నగేష్ సన్మానించారు. ఈమేరకు గ్రామంలో సోమవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం

- ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీతో పాటు, వైద్యులు హరీష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈనెల 19వ తేదీన మండల కేంద్రంలో ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలు పాల్గొని, అవకాశాన్ని వినియోగించుకోవాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యక్రమానికి సహకరించి దిగ్విజయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని పెద్దగుల్లా గ్రామంలో రూ.పది లక్షల వ్యయంతో ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం ముమ్మరంగా కొనసాగుతోందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హన్మంత్ షిండేను కలిసిన గ్రామ దళిత నాయకులు కలిసి ఎస్సీ కమ్యూనిటీ భవనం కోసం నిధులను మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తన నిధుల నుంచి రూ.పది లక్షలు మంజూరు చేస్తున్నానని, వెంటనే పనులను పూర్తి చేయాలని గ్రామస్తులకు ఆదేశించారు. పనులు త్వరలోనే పూర్తి చేస్తామని గ్రామ సర్పంచ్ రుక్మిని బాయి విఠల్ పటేల్ తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి మృతి



నవతెలంగాణ-బిచ్కుంద

ద్విచక్రవాహనం ఢీకొని గాయపడ్డ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ శ్రీధర్ రెడ్డి వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన హఫీజుర్ రెహమాన్ (అన్వర్) (53) ఈ నెల 13వ తేదీన శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి తిరిగి తన ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా.. అదే సమయంలో అతి వేగంగా అజాగ్రత్తగా టీవీఎస్ ఎక్సెల్ నడుపుతూ వస్తున్న చెన్నూరి రమేష్ ఓ కిరాణా షాపు వద్ద వెనుక నుంచి ఢీకొనడంతో హఫీజుర్ రెహమాన్ (అన్వర్) కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య హజారా బేగం ఫిర్యాదు మేరకు టీవీఎస్ ఎక్సెల్ నడిపిన చెన్నూరి రమేష్‌పైన, వాహన యజమాని గంగారంపైన కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంచి మనిషి, సామాజిక సేవకుడిని కోల్పోయాం..

సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ తోచిన సహాయం చేస్తూ ఈ ప్రాంతంలో విద్యను అభ్యసిస్తున్న ఎందరో విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం దిశా నిర్దేశం చేస్తూ సహాయ సహకారాలు అందించిన హఫీజుర్ రెహమాన్ సేవలు మర్చిపోలేనివని మంచి మనిషి, సామాజిక సేవకుడిని కోల్పోయామని జుక్కల్ శాసనసభ్యులు హనుమంత్ షిండే, ఎంపీపీ అశోక్ పటేల్, జెడ్పీటీసీ భారతిరాజు తెలిపారు. హఫీజుర్ రెహమాన్ మరణం పట్ల వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు అశ్రునయనాలతో సంతాపం వ్యక్తం చేశారు.

చెరువులో పడి యువకుడు మృతి

నవతెలంగాణ-రామారెడ్డి

తాగుడుకు బానిసై, మతిస్థిమితంతో చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొలుపుల రాజేష్ (బన్నీ) (18) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. కాగా మేనమామ భూమేష్ పెంపకంలో ఉన్నాడు. మద్యానికి బానిసై, మతిస్థిమితం లేక ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. శనివారం రాత్రి మద్యం సేవించి ఇంట్లో గొడవ చేసి, ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం గ్రామ శివారులోని పటేల్ చెరువులో శవమై తేలటంతో రోడ్డుపై నుంచి వెళ్లేవారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. మేనమామ భూమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

లారీని ఢీ కొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-భిక్కనూర్

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మరణించిన ఘటన మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై టోల్ గేట్ వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన బాలయ్య(44) వ్యవసాయానికి సంబంధించిన విత్తనాల కోసం భిక్కనూర్ పట్టణానికి వెళ్లి విత్తనాలను తీసుకొని ఇంటికి వెళుతున్న సమయంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని గమనించకుండా వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో బాలయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి బాలయ్యను 108లో కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలయ్య చనిపోయాడు. శవానికి పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు మైనార్టీ రుణాల కోసం ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-రామారెడ్డి

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రెండు యూనిట్ల మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రామారెడ్డి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పత్రాలతో సకాలంలో హాజరుకావాలని సూచించారు.

కామ్రేడ్ బిల్లా బాగులు సంస్మరణ సభ

నవతెలంగాణ-బోధన్

కామ్రేడ్ బిల్లా బాగులు సంస్మరణ సభను బోధన్ పట్టణంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కామ్రేడ్ బిల్లా బాగులు చేసిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు మల్లేష్, పీఓడబ్ల్యూ బోధన్ పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, ఐఎఫ్‌టీయూ నాయకులు జి.సీతారాం, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి బి.చందు, కీర్తన, నిఖిత, బీడీ కార్మికులు లక్ష్మి, అనసూయ, లింగక్క, లక్ష్మి, పోశవ్వ, గంగామణి, పెద్దలక్ష్మి, అనంతగిరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గౌడ యువజన సంఘ క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్లో గౌడ యువజన సంఘ మోకు దెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను ఎస్ఐ ఆనంద్‌గౌడ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ.. యువకులు పోలీసులకు సహకరించి నేరాల అదుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో యువజన గౌడ అధ్యక్షుడు మీసాల ప్రవీణ్ గౌడ్, జిల్లా నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, నరేందర్‌గౌడ్, మండల నాయకులు పరశురామ్ గౌడ్, సురేష్ గౌడ్, హరీష్ గౌడ్, మణిదీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత ముస్తాపూర్

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా ముస్తాపూర్ జట్టు నిలిచింది. విజేతలకు మొదటి బహుమతి ముక్కార సంజీవరెడ్డి సహకారంతో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు ముక్కార ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా మొదటి బహుమతి రూ.5వేలు నగదు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ముక్కర ప్రతాప్‌రెడ్డి, ముక్కర సుధాకర్‌రెడ్డి, వివేకానంద అశోక్, నారాయణ, లక్ష్మారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తీరొక్క ముగ్గులు



నిజామాబాద్‌సిటీ : దుబ్బలో ఓ ఇంటి ఎదుట వేసిన ముగ్గు

సంబురంగా సంక్రాంతి, కనుమ

- పతంగులు ఎగురవేసిన చిన్నాపెద్దా
- పలుచోట్ల ముగ్గుల పోటీలు.. బహుమతులు అందజేత

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆది, సోమవారం సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతలు తమ వాకిళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులను వేశారు. ఇక చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ పతంగులను ఉత్సాహంగా ఎగురవేశారు. డీజే సౌండ్ బాక్సులను ఏర్పాటు చేసుకుని పాటలు వింటూ.. కేరింతలతో పతంగులను ఎగురవేయడం ఆకట్టుకుంది. ఇక పలుచోట్ల ముగ్గుల పోటీలను నిర్వహించి.. బహుమతులను అందజేశారు.

వర్ని : చందూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మహిళలకు సెవెన్ హిల్స్ ఆస్పత్రి బాన్సువాడ వారి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. పోటీల్లో విజయం సాధించిన వారికి చందూర్ ఎంపీపీ లావణ్య, సర్పంచ్ సాయిరెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించినట్టు ఎంపీపీ రజనీకిషోర్, జడ్పీటీసీ మేక విజయ సంతోష్ తెలిపారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు యోగేష్, హిందూ వాహిని మండల అధ్యక్షులు శివకుమార్, బోధన్ పట్టణ అధ్యక్షులు సాయిలు, సీనియర్ నాయకులు మేక సంతోష్, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాపూర్ గ్రామంలో ముగ్గుల పోటీలు..

లింగంపేట్ : మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ దాత ముక్కర సంజీవరెడ్డి సహకారంతో గ్రామంలో మహిళలకు యువతులకు చిన్నారులకు ముగ్గుల పోటీలను సర్పంచ్ మమత వివేకనంద అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. పోటీలలో 74 మంది మహిళలు పాల్గొన్నారు. ఆసక్తితో రంగురంగుల ముగ్గులు వేశారు. ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి మద్రిపల్లి నవీన రూ.1000, రెండో బహుమతి నీరడి రజినిత రూ.500, మూడవ బహుమతి ఎర్ర సౌందర్య రూ.250 నగదును రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి 71 మందికి రూ.100 చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో న్యాయవ్యాధి నారాయణ, సుధాకర్‌రెడ్డి ఉపసర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్ యువకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు.


కంఠేశ్వర్ : పతంగి ఎగురవేస్తున్న బాలుడు


వీవీ నగర్ కాలనీలో వేసిన ముగ్గు..


పిట్లంలో వేసిన ముగ్గు

రామారెడ్డి : మండలంలోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాకిళ్లలో రంగురంగుల ముగ్గులతో, పిల్లల పతంగులతో పల్లెలు కనువిందు చేశాయి. రైతులు సాంప్రదాయంగా నవధాన్యాలతో, పేడ పిడకలపై పాలను ఇంటి ముందు పొంగించారు.

బోధన్ : సంక్రాంతి పండగ వేడుకలను బోధన్ ఉమ్మడి మండలంలో ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక నైవేద్యాలతో వారి పంట పొలాలకు వెళ్లి పంటలకు పూజలు చేశారు. అనంతరం ఇంటిల్లిపాది పిండి వంటలను భుజించి ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాలుర మండలంలో ఎంపీపీ బుద్దె సావిత్రి వారి పంట పొలంలో పంటలకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, వైస్ చైర్మన్ సాలూర షకీల్, భవానిపేట్ సర్పంచ్ పాల్గెంపాటి కృష్ణ ప్రసాద్, గౌడ సంఘం నాయకులు స్వామి గౌడ్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజగౌడ్, ఖదీర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో భోగి, సంక్రాంతి, కనుమ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించిన సంక్రాంతి పర్వదినం సందర్భంగా తమ వాకిళ్లలో ఆడపడుచులు రంగురంగుల ముగ్గులు వేశారు.


కంఠేశ్వర్ : ముగ్గు వేస్తున్న చిన్నారులు


రామారెడ్డిలో పాలను పొంగిస్తున్న దృశ్యం

మహిళలకు బహుమతులు అందజేత..

దోమకొండ : మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో విప్రో ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ సౌజన్యంతో, పద్మశ్రీ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విప్రో ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ జేఎస్ఓ రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో విప్రో ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, పద్మశ్రీ యువజన సంఘం, అధ్యక్షులు మేక నాగరాజు, క్యాషియర్ అందే గణేష్, ఇంచార్జ్ రాజేందర్, ఆలయ పూజారి భావి శివకుమార్ శర్మ, మేక సిద్ధరాములు, కాశి శ్యామ్, యువజన సంఘం సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.


బోధన్ : పంట చేనులో ఎంపీపీ పూజలు


లింగంపేట్ : విజేతలకు నగదు బహుమతి ప్రదానం


వర్ని : చందూర్‌లో బహుమతులు పంపిణీ


రెంజల్ : ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీపీ

పరిశ్రమ ఉపాధి కల్పనలో తెలంగాణ మేటి

- పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి


రైస్‌మిల్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్

పరిశ్రమలు నెలకొల్పడానికి తెలంగాణ ప్రభుత్వం ఔత్సాహికులకు నూతన ఉత్తేజం కలిగిస్తుందని, నేడు తెలంగాణ రాష్ట్రం పరిశ్రమల ఉపాధి కల్పనలో ముందంజలో ఉందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ బాలాజీ రైస్‌మిల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వ్యవసాయ రంగానికి అనుగుణమైన పారిశ్రామిక రంగానికి ప్రముఖ పాత్ర ఇస్తుందని తెలిపారు. 2014లో 30 లక్షల 23 వేల టన్నుల ఉత్పాదక నుంచి 2021-22 వరకు ఒక కోటి 30 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి సామర్థ్యం సాధించ గలిగామని తెలిపారు. ఆర్థిక అభివృద్ధికి వ్యవసాయ రంగం దాని అనుబంధ రంగాలు ప్రాధాన్యత కల్పించినప్పుడు ఉపాధి పెరుగుతుందని, కరెంటు, నీటి సరఫరా కలిగించి రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి మరువలేనిదని చెప్పారు. దానిలో భాగంగానే రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి అందిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా రైతుబంధు అమలు చేయాలని పలు రాష్ట్రాలు కోరుతున్నాయని, రైతుల ప్రాధాన్యత పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపు మరువలేనిదని కొనియాడారు. రైతులకు అందుబాటులో స్వయంకృషితో గ్రామానికి చెందిన సుబ్బారావు, ప్రసాదరావు రైస్‌మిల్ నెలకొల్పడం ఆనంద దాయకమని వారిని అభినందించి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ముందుకు సాగాలన్నారు. అంతకుముందు కోటగిరిలో మైనార్టీ శ్మశాన వాటిక చుట్టు ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. రూ.57 లక్షల నిధులు వివిధ పనుల కోసం మంజూరయ్యాయని తక్షణమే నిర్మాణం చేపట్టాలని ఆయన సూచించారు. ఆర్డీవో రాజేశ్వర్, ఏసీపీ కిరణ్ కుమార్, కోటగిరి సర్పంచ్ పత్తి లక్ష్మణ్, కోటగిరి విండో అధ్యక్షులు కోచి సిద్దు, జడ్పీటీసీ శంకర్ పటేల్, జెడ్పీటీసీ కోఆప్షన్ సిరాజుద్దీన్, వైస్ ఎంపీపీ బాల తాకిరే, మార్కెట్ కమిటీ చైర్మన్ హైమద్, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, కమ్మ సంఘం నాయకులు, రవికిరణ్, శివన్నారాయణ, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, రైస్‌మిల్ నిర్వాహకులు సుబ్బారావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ ఇన్‌చార్జీ ఎంపీడీగా సురేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ ఇన్‌చార్జీ ఎంపీడీఓగా సురేందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇదివరకు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న కె.లక్ష్మీ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రంలో 40 రోజులు ఫౌండేషన్ అనే శిక్షణ తీసుకుంటున్నట్టు ఇన్‌చార్జీ ఎంపీడీఓ సురేందర్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే కృషితోనే మండలం అభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ఎమ్మెల్యే హన్మంతు షిండే ప్రత్యేక చొరవ తీసుకుని మండల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రతి గ్రామం అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పెద్దకొడప్‌గల్ మండల అభివృద్ధికి రూ.4కోట్ల 25లక్షల నిధులను మంజూరు చేయడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. ఎస్టీ తండాలకు కంకర రోడ్లను బీటీ రోడ్లుగా మార్చడానికి ఈ నిధులు మంజూరు చేసినట్టు ఆయన అన్నారు. జెడ్పీ రోడ్డు నుంచి సర్దార్ తండా వరకు రూ.24లక్షలు, బర్గపల్లి నుంచి మన్సింగ్ తండా వరకు రూ.2కోట్లు, సముందర్ తండా నుంచి మహారాష్ట్ర బార్డర్ వరకు రూ.కోటి 60లక్షలు, విఠల్‌వాడి నుంచి చింతల్వడి తండా వరకు రూ.41లక్షలు మంజూరు చేసినట్టు తెలియజేశారు. అలాగే గ్రామ పంచాయతీల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.3కోట్లు, ప్రతి గ్రామంలో పంచాయతీ భవనాలు ఒక్కోదానికి రూ.20లక్షలు మంజూరు చేశారని తెలిపారు. అలాగే మండలంలో దాదాపు 165 డబుల్ బెడ్రూంలు మంజూరు చేశారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ దేశాయ్, ఖండేరావు పటేల్, బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ చిప్ప రమేష్, హనుమంత్‌రెడ్డి, మహమ్మద్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట ధ్వంసం

- పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-భిక్కనూర్


ధ్వంసమైన చెరువు కట్టను పరిశీలిస్తున్న దృశ్యం

మండలంలోని కాచాపూర్ గ్రామంలో గల నాగప్ప కొండ చెరువు కట్టను ఒకరు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు సోమవారం పరిశీలించారు. మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా రూ.18 లక్షల వ్యయంతో నాగప్ప కుంటను మరమ్మతు చేసి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులకు వీలుగా చెరువు కట్టను వేశారు. గ్రామానికి చెందిన ఒకరు చెరువు కట్టను జేసీబీ సహాయంతో ధ్వంసం చేసి తన వ్యవసాయ పొలంలోకి రోడ్డు వేసుకున్నారు. దీంతో రైతులు వారి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఈ విషయాన్ని చుట్టుపక్కల రైతులు రెవెన్యూ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే తహసీల్దార్ నరసింహులు, నీటిపారుదల శాఖ ఏఈ ఆనంద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ ఘటనా స్థలానికి చేరుకొని ధ్వంసం చేసిన కట్టను పరిశీలించారు. చెరువు కట్టను ధ్వంసం చేసిన వ్యక్తిపై తగు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. వారి వెంట మాజీ ఎంపీపీ సుదర్శన్, గ్రామ నాయకులు జీవన్‌రెడ్డి, రాములు గ్రామ రెవెన్యూ సిబ్బంది రైతులు ఉన్నారు.

కంటి వెలుగు కేంద్రాల పరిశీలన



నవతెలంగాణ-ఆర్మూర్

రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి ఆర్మూర్‌లోని పలు డివిజన్లలో ఏర్పాటు చేసిన కేంద్రాలను సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఈ నెల 19 నుంచి మొదలుకానున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేపట్టినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్ తెలిపారు. 1, 4, 33, వార్డులలో అధికారులతో వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి ఈ భూమేశ్వర్, ఆరోగ్యశాఖ అధికారులు తదితరులున్నారు.

కల్లు సీసాలో కుళ్లిన ఎలుక ప్రత్యక్షం



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

నాగిరెడ్డిపేట్‌లోని గ్రామ కల్లు దుకాణంలో ఒక కల్లు సీసాలో కుళ్లిన ఎలుక ప్రత్యక్షం కావడంతో గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. గోపాల్‌పేట్‌లో సోమవారం వారంతపు సంత కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున సంతకు వచ్చారు. ఈ క్రమంలో సేదదీరేందుకు పలువురు కల్లు దుకాణానికి వెళ్లారు. కాగా ఒక సీసాలో కుళ్లిన ఎలుక కనిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కల్లు తయారీలో నాణ్యత పాటించడం లేదని, అధికారులు సైతం తనిఖీలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారంకోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 21 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జెడ్పి సీఈఓ గోవింద్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను వెంటదివెంట పరిశీలిస్తూ ప్రజావాణి సైట్‌లో వివరాలను నమోదు చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పలు అంశాలపై సూచనలు చేశారు.

జంతు సంరక్షణ పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31వరకు కొనసాగనున్న జంతు సంరక్షణ పక్షోత్సవాల కార్యక్రమాన్ని పురస్కరించుకుని రూపొందించిన కరపత్రాలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, చిత్రామిశ్రా సోమవారం ఆవిష్కరించారు. పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ తరహా కార్యక్రమాల వల్ల విద్యార్థులు, ప్రజల్లో జంతువుల సంరక్షణ పట్ల అవగాహన పెరుగుతుందని అన్నారు. రోడ్లపై సంచరించే మూగజీవాలకు తగిన ఆవాసం కల్పిస్తూ, మేతను అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు జగన్నాథచారి తదితరులు పాల్గొన్నారు.



జంతు సంరక్షణ పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రానికి చెందిన పలువురు లబ్దిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను కోఆప్షన్ సభ్యులు పర్సవీన్, అజ్మత్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని అంజుమన్ ఫారంలో పుల్లేటి మోహన్ ఇంటి ఖాళీ ప్రదేశంలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. వారి వద్ద నుండి పేకముక్కలతో పాటు 2500 రూపాయలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు మొరం ట్రాక్టర్లు సీజ్

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని మహంతం శివారు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నుండి అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మైన్స్ అండ్ జువాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడి చేసి రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మొరం తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి సాయిలు



మాట్లాడుతున్న సాయిలు

నవతెలంగాణ-భీంగల్

ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు ప్రభుత్వం వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఆరెపల్లి సాయిలు కోరారు. సోమవారం పట్టకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది పైచదువులు చదివి ఉపాధి లేక ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తు దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకునేందుకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో మండల నాయకులు ఇంత్యాజ్ మరియు డ్రైవర్లు అరుణ్, షాహిద్, బాబ, అన్వర్, రమేష్, గంగాధర్, సాయి తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈడెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు చేతుల మీదుగా సోమవారం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈడెన్ ఫౌండేషన్ ఫౌండర్ దామెర సునీల్ మాట్లాడుతూ.. గత ఐదారు సంవత్సరాలుగా తమ ఫౌండేషన్ నడుపుతున్నామని స్వచ్ఛందంగా అన్ని కార్యక్రమాలను విధిగా తమ వంతు బాధ్యతగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ఈడెన్ ఫౌండేషన్ నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు మరిన్ని చేసి మంచి గుర్తింపు పొందాలని సీపీ సూచించారు.

పోలీస్‌శాఖ తరపున ఎలాంటి సహాయ సహకారాలు అవసరమన్న తప్పనిసరిగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో దామెర సునీల్ పి ఈ టి (ఫౌండర్), వెంకటయ్య ఏఎస్ఐ, ప్రసాద్ రాజ్ పిడి, అనిల్, నరేష్ అడ్వకేట్, ఏసురత్నం ఫైర్ డిపార్ట్‌మెంట్ రవీందర్, కానిస్టేబుల్ సురేష్, ఆర్టీసీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణపై 18న జనరల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న సాయగౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకెఎమ్ఎస్ నిజామాబాద్ జిల్లా జనరల్ కౌన్సిలింగ్ సమావేశం ఈనెల 18న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని యన్ ఆర్ భవన్ కోట గల్లీలో ఉదయం 11 గంటలకు జిల్లా జనరల్ కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని రాష్ట్ర కార్యదర్శి సాయగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఏఐకెఎమ్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఉద్యమ సమీక్షతో పాటు తిరిగి ఉద్యమ కార్యచరణ, అఖిల భారత రైతు కూలీ సంఘం రెండు సంఘాలుగా విడిపోయి ఒకటి తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ సంఘంగా, రెండోది తెలంగాణ ప్రగతిశీల కూలీ సంఘంగా ఏర్పాటు కానున్నట్లు అయన వివరించారు. ఈ సమావేశానికి రైతులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జిల్లా జనరల్ కౌన్సిలింగ్ సమావేశం విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వాసరి మోహన్, గంటా రాజేందర్, రాందాస్, పోశయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మాయావతి జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న నాయకులు, చిన్నారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో బహుజన సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని మనవత సదన్ ఆశ్రమంలో పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇన్చార్జ్ జిల్లా కార్యదర్శి హరీష్, నియోజకవర్గం అధ్యక్షులు పోతే ప్రవీణ్, ఉపాధ్యక్షులు జిన్న సంపత్,ట్రెజరర్ విజయ్ వారియర్, మండల అధ్యక్షులు బాబురావు, మండల యువ నాయకులు సంపత్, బహుజన సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు ముత్తేన్న నాయకులు పాల్గొన్నారు.

సుర్బిర్యాల్‌లో క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు బహుమతి అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

సంక్రాతి పండగ సందర్భంగా 12 సంవత్సరాలుగా మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలో ఆదివారం ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 16 జట్లు పాల్గొనగా ఈ సంవత్సరం గ్రామ మాజీ సర్పంచ్ సట్లపల్లి లక్ష్మయ్య జ్ఞాపకార్థం పోటీలు నిర్వహించారు. మొదటి విజేతగా రెడ్డీస్ ఒక యూత్, రెండో విజేతగా వారహి యూత్, బెస్ట్ బ్యాటర్ అవార్డు మంచిర్యాల పవన్ గెలుచున్నారు. వీరికి గ్రామ సర్పంచ్ సట్లపల్లి సవితగణేష్ బహుమతులను అందజేసి అభినంధించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాటం శిరీషనవీన్ , గ్రామ యువకులు పాల్గొన్నారు.

సాలూరలో స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే షకీల్ ఆమెర్

నవతెలంగాణ-బోధన్/ఎడపల్లి

క్రీడాకారుల సౌకర్యార్థం సాలూర మండల కేంద్రంలో క్రీడా స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అన్నారు. సోమవారం సాలూరు మండల కేంద్రంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన హాజరై ప్రసంగించారు. క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో అల్లె జనార్దన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడ పోటీలు నేటి యువతకు చాలా అవసరమని పేర్కొన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 22 జట్లు పాల్గొని తలపడ్డాయని, ప్రతి టీం గెలుపు లక్ష్యంగా పోటీలో తలపడ్డారని వారిని అభినందించారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికైనా సతీష్, సాయి తేజలకు మెమొంటోలు అందజేశారు. జైభీమ్ టీం, ఛత్రపతి శివాజీ టీం ఫైనల్ మ్యాచ్‌కు చేరడంతో వారిని అభినందించారు. క్రీడా పోటీల్లో గెలిచిన, ఓడిన దాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమ క్రీడాకారులుగా తయారు కావాలన్నారు. రాబోయే రోజులలో సాలూర మండలంలో క్రీడాకారుల సౌకర్యార్థం మంచి స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం యువత సౌకర్యార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న అల్లె జనార్దన్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన ఛత్రపతి శివాజీ జట్టుకు రూ.22,222, రన్నరప్‌గా నిలిచిన జైభీం జట్టుకు రూ.11,111 నగదు బహుమతిని టోర్నమెంట్ నిర్వాహకులు అల్లె జనార్దన్ అందజేశారు. అనంతరం ఆయన వివాహ వార్షికోత్సవం సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ శరత్, సర్పంచ్ చంద్రకళ, మాజీ ఉపసర్పంచ్ ఖదీర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షులు నరసయ్య, శివాలయం చైర్మన్ బుజ్జి, సాలంపాడ్ తూము రవి, కన్నె సాయిరెడ్డి, బుద్దె లక్ష్మణ్, సర్పంచులు చింతం నాగయ్య, రావుబా గంగాధర్, బీఎస్పీ నాయకులు పాండు, ఈశ్వర్, టీఆర్ఎస్ యూత్ నాయకులు జక్క సంజీవ్ పటేల్, నాగన్‌పల్లి మధు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పలువురు..

ఎడపల్లి : బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ షకీల్ అమీర్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు, అంబం (వై) సర్పంచ్ పిస్క గంగాప్రసాద్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్‌కు సోమవారం పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే షకీల్ అమీర్ నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు, మత్స్య కార్మిక శాఖ జిల్లా డైరెక్టర్ బోయి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన టీఆర్ఎస్ మండల నాయకులు..

బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్‌ను టీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీరామ్‌తో పాటు నాయకులు ఎమ్మెల్యే షకీల్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎమ్మెల్యే ఎండీ షకీల్ ఆమీర్ విదేశాలకు వెళ్లి తిరిగి రావడం పట్ల ఆయనకు మండల టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఎండీ షకీల్ అమీర్‌కు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండల టీఆర్ఎస్ పార్టీ నాయకులకు తేనేటి విందును ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీఆర్ఎస్ ఎడపల్లి మండల ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లెపూల సురేష్‌గౌడ్, మంగళ్‌పాడ్ టీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు హసేన్, నాయకులు ఏరోల్ల సాయికుమార్, సాటాపురం పోచయ్య తదితరులు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

జడ్పీ నిధులతో మెటల్ రోడ్డు నిర్మాణ పనులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పాడ్ దళితవాడ నుంచి నిజాంసాగర్ ప్రధాన ఉపకాలువ డీ 46/3 వరకు సుమారు మూడు కిలోమీటర్ల పొడవున జెడ్పీ నిధులతో మెటల్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసినట్టు ఎడపల్లి మండలం మంగల్‌పాడు సర్పంచ్ బట్టు హన్మండ్లు తెలిపారు. సుమారు రూ.5లక్షల నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఆయన వివరించారు. సుమారు 60 సంవత్సరాల కాలం నుంచి జరగని అభివృద్ధి పని తన పదవీ కాలంలో చేపట్టడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళ్‌పాడ్ గ్రామ శివారులో శ్మశాన వాటిక ఉన్నందున గ్రామస్తులు శ్మశాన వాటికకు రావడానికి సులభంగా ఉందన్న గతంలో ఇబ్బందులు పడేవారమని గ్రామస్తులు తెలిపారు.



రోడ్డు పనులు

మెటల్ రోడ్డు నిర్మాణ పనులు అభివృద్ధికి కృషిచేసిన సర్పంచ్ బట్టు హన్నండ్లకు, జెడ్పీ నిధులు మంజూరు చేసిన జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-వర్ని

వర్ని మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు బాధితులకు, లబ్దిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. బాన్సువాడలోని తన నివాసంలో సర్పంచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా కారణాలతో ఆస్పత్రిలో చికిత్సలు చేసుకున్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డల పెండ్లిలకు మేనమామగా సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నారని అన్నారు. సిద్ధ గ్రామానికి ఒక చెక్కు, జలాల్పూర్ గ్రామానికి మూడు చెక్కులు, కొనిపూరు గ్రామానికి ఒక చెక్కు, తగలపెల్లి గ్రామానికి ఒక చెక్కును సర్పంచ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల ఏఎంసి ఉపాధ్యక్షులు వెలగపూడి గోపాల్, మండల అధ్యక్షులు కలాల్ గిరి, సర్పంచులు దశరథ్, వెంకట్ గౌడ్, వెంకన్న, ఎంపీటీసీ బక్క నారాయణ, మధు, తదితరులు ఉన్నారు.



చెక్కులను అందజేస్తున్న స్పీకర్

విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన గర్నె రసజ్ఞ నిరుపేద విద్యార్థికి సోమవారం ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి సాయన్న తన నివాస గృహంలో రూ.4వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. గర్నె సంగయ్య నిరుపేద కుటుంబం కావడంతో ఆయన కూతురుకు గర్నె రసజ్ఞ ప్రతిమ మెడికల్ కాలేజ్ కరీంనగర్ నందు ఎంబీబీఎస్ విద్యను అభ్యసిస్తుంది. పేద విద్యార్థి కావడంతో ఆర్థిక స్థోమత లేక ఉన్నత చదువులపై ఆసక్తి ఉన్నప్పటికీ మానవతా దృక్పథంతో విద్యార్థిని ప్రోత్సహించడానికి రూ.4వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ గల నిరుపేద విద్యార్థికి ఆర్థికంగా అండగా ఉండేదుకై చిన్న చిరు సహాయం చేశానని చెప్పారు. కార్యక్రమంలో రాంపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు, విద్యార్థి తండ్రి కుటుంబ సభ్యులున్నారు.